## కేంద్రంలో హ్యాట్రిక్‌కు గ్యారెంటీ!

### మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. తన ప్రభుత్వ అజెండా అయిన ఆత్మ నిర్భర భారత్ సాధించిన విజయంగా ఎన్నికల ఫలితాలను అభివర్ణించారు. ఈ హ్యాట్రిక్ గెలుపు 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ గెలుపుకు హామీ ఇస్తున్నట్టు తెలిపారు. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ శ్రేణులు, కేంద్ర మంత్రులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్, విపక్ష ఇండియా కూటమికి తాము గుణపాఠం నేర్పించామన్నారు. ఇండియా కూటమి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేదన్నారు.

## ఈవీఎంల వల్లే మూడు రాష్ట్రాల్లో ఓడాం: కాంగ్రెస్

న్యూఢిల్లీ : మూడు రాష్ట్రాల్లో ఓటమికి కారణం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ (ఈవీఎం)లేనని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ఆ పార్టీ నేత ఉదిత్ రాజ్ ఆదివారం చేసిన ఓ ట్వీట్‌లో 'ఈవీఎంల వల్ల ఏదో జరిగి ఉంటుంది, లేదంటే ఇలాంటి ఫలితాన్ని ఊహించలేదు' అని చెప్పారు. 'నేటి ఎన్నికల ఫలితాల తర్వాత, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మనుగడ సాగించడం కష్టమేననిపిస్తున్నది'' అని ఆందోళన వ్యక్తం చేశారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం జరిగింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైంది. బీజేపీ విజయం సాధించింది. మిజోరం శాసన సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరుగుతుంది.

## నోటాకు ఎన్ని ఓట్లు పడ్డాయంటే?

న్యూఢిల్లీ: రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం పూర్తయింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోతే నోటా (పైన ఉన్నవారు ఎవరూ కాదు) మీటను నొక్కి ఓటరు తన అభిప్రాయాన్ని చెప్పవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగించుకున్నవారి సంఖ్యను ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

| రాష్ట్రం | పోలింగ్ శాతం | నోటాకు పడ్డ ఓట్ల శాతం |
|---|---|---|
| మధ్యప్రదేశ్ | 77.17 | 0.99 |
| ఛత్తీస్‌గఢ్ | 76.3 | 1.29 |
| తెలంగాణ | 71.14 | 0.74 |
| రాజస్థాన్ | 74.62 | 0.96 |

## రాజస్థాన్‌లో 17 మంది మంత్రుల ఓటమి

జైపూర్, డిసెంబర్ 3: రాజస్థాన్ మంత్రివర్గంలోని 25 మందిలో 17 మంది తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. వీరిలో పార్టీ ప్రచార కమిటీకి సారథ్యం వహించిన గోవింద్ రామ్ మేఘ్వాల్ కూడా ఉన్నారు. రమేశ్ చంద్ మీనా, షేల్ మొహమ్మద్, భన్వర్ సింగ్ భాటి, శకుంతల రావత్, విశ్వేంద్ర సింగ్, ఉదయ్‌లాల్ అంజన తదితరులు ఓడిన మంత్రుల జాబితాలో ఉన్నారు. గెహ్లాట్‌కు సలహాదారులుగా ఉన్న అయిదుగురితోపాటు మాజీ చీఫ్ సెక్రటరీ నిరంజన్ ఆర్య కూడా ఎన్నికల్లో పరాజయం చవిచూశారు. అశోక్ గెహ్లాట్ సర్దార్‌పురా నుంచి గెలిచినా 2018తో పోలిస్తే మెజార్టీ తగ్గింది.

# 'చే'జార్చుకున్నారిలా!

## మూడు రాష్ట్రాల్లో హస్తం ఓటమికి ఐదు కారణాలు

లోక్‌సభ ఎన్నికలకు ముందు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు హిందీ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించింది. మధ్యప్రదేశ్‌లో కమలదళం మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోగా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లు కాంగ్రెస్ చేజారిపోయాయి. కాగా, ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి 5 ప్రధాన కారణాలు ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

–స్పెషల్ టాస్క్ బ్యూరో (నమస్తే తెలంగాణ)



గవర్నర్ కల్‌రాజ్‌మిశ్రాకు రాజీనామా సమర్పిస్తున్న రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్

### ఛత్తీస్‌గఢ్



1. *మహదేవ్ యాప్ కేసు:* బెట్టింగ్ యాప్ రూపొందించేందుకు స్వయంగా సీఎం భూపేశ్ బఘేల్ తనను ప్రోత్సహించారని ప్రధాన నిందితుడు శుభమ్ సోని ఆరోపించడం.. బఘేల్ రూ. 508 కోట్లు తీసుకొన్నట్టు ఈడీ ఆరోపించడం దుమారం రేపింది.
2. *ఓబీసీ రిజర్వేషన్:* స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి అధికారంలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఓబీసీ రిజర్వేషన్లను తీసుకురాలేదన్న బీజేపీ విమర్శలను సమర్థంగా తిప్పికొట్టడంలో కాంగ్రెస్ విఫలం. దీంతో ఓబీసీ ఓటర్లు దూరమయ్యారు.
3. *ప్రభుత్వంలో అవినీతి:* ఛత్తీస్‌గఢ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ( సీజీపీఎస్సీ)లో అక్రమాలు, ఉద్యోగాల నియామకాల్లో బంధువులకు ప్రాధాన్యం ఇవ్వడం, బొగ్గు రవాణా, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్స్, మద్యం వ్యాపారం, పీడీఎస్‌లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు నష్టం చేకూర్చాయి.
4. *దూరమైన గిరిజనులు:* గిరిజనులు ఏండ్లుగా పోరాడుతున్న 'జల్, జంగల్, జమీన్ (నీళ్లు, అటవీ పరిరక్షణ, భూహక్కులు)' కల్పిస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమవ్వడంతో ప్రభుత్వంపై ఆ వర్గంలో వ్యతిరేకత పెరిగింది.
5. *మౌలిక సదుపాయాల కల్పనలేమి:* రాష్ట్రాభివృద్ధికి కీలకమైన రోడ్లు, రైల్వే, విద్యుత్తు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం.

### రాజస్థాన్



1. *అంతర్గత కుమ్ములాటలు:* 2018లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌లో సీఎం అశోక్ గెహ్లాట్, మరో కీలక నేత సచిన్ పైలట్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉన్నది. దీంతో ప్రభుత్వాన్ని కాపాడుకోవడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్రాభివృద్ధిపై లేకుండాపోయింది.
2. *ఇచ్చిన హామీలు గాలికి:* వసుంధర రాజే నేతృత్వంలోని గత బీజేపీ సర్కారుపై అవినీతి ఆరోపణలు చేసి 2018లో గద్దెనెక్కిన కాంగ్రెస్ తదనంతర గత ప్రభుత్వంపై చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా నిలబెట్టుకోలేదు.
3. *పేపర్ లీకులు:* గడిచిన ఐదేండ్లలో 18 పేపర్లకు పైగా పరీక్షా పేపర్లు లీక్ అవ్వడంపై నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారు.
4. *రెడ్ డైరీ:* గెహ్లాట్ సర్కారు లంచాల బాగోతం అంతా ఈ 'రెడ్ డైరీ'లో ఉందంటూ సొంత పార్టీ నేత, మంత్రి రాజేంద్ర గుఢా అసెంబ్లీలో ప్రకటించడం దుమారం రేపింది.
5. *శాంతి–భద్రతల వైఫల్యం:* ఉదయ్‌పూర్‌లోని టైలర్ కన్హయ్యలాల్ సాహూ హత్య, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదన్న విమర్శలు.

### మధ్యప్రదేశ్



1. *ఎండగట్టలేక..:* వివిధ వర్గాలను ఆకట్టుకొనేలా బీజేపీ మ్యానిఫెస్టోలో తీసుకొచ్చిన 'మామా స్కీమ్', 450కే సిలిండర్, అయోధ్య దర్శనం వంటి పథకాలకు ధీటైనవి ప్రకటించడంలో కాంగ్రెస్ విఫలమైంది. ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టడంలోనూ ఫెయిల్.
2. *కమల్‌నాథ్:* మాజీ సీఎం కమల్‌నాథ్‌ను సీఎం అభ్యర్థిగా ముందే ప్రకటించడం నష్టాన్ని తీసుకొచ్చింది. కమల్‌కు ఆయా వర్గాల్లో మద్దతు అంతగా లేకపోవడం, ప్రచారంలో దూకుడు ప్రదర్శించకపోవడం మైనస్‌గా మారింది.
3. *సింధియా ఎపిసోడ్:* రాష్ట్రంలో 34 సీట్లు ఉన్న గ్వాలియర్–చంబల్ ఎంతో కీలకమైంది. 2020లో జ్యోతిరాదిత్య సింధియా పార్టీని వీడి బీజేపీలో చేరారు. దీంతో ఈ ప్రాంతంలో మరో బలమైన నేతను తయారుచేయడంలో కాంగ్రెస్ విఫలమైంది.
4. *వ్యూహాలేవి?:* 2018లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. బీజేపీ వ్యూహాలతో 15 నెలల్లోనే గద్దె దిగాల్సి వచ్చింది. అయితే, అప్పటినుంచి కమలదళాన్ని ఎదుర్కొనేందుకు ఎటువంటి బలమైన వ్యూహాలను పార్టీ రచించలేదు. సరైన కార్యాచరణ లేదు. విమర్శల్లోనూ దూకుడు కనిపించలేదు.
5. *హిందుత్వ ఆకర్షణ ఫెయిల్:* హిందూ ఓటర్లను ఆకర్షించడానికి భజరంగ్ సేనతో కాంగ్రెస్ చేతులు కలిపింది. ఇదే సమయంలో ముస్లింలకు పలు హామీల వర్షాన్ని కురిపించింది. దీంతో హిందూ ఆకర్షణ మంత్రం పనిచేయలేదు.

## 3కు తగ్గిన కాంగ్రెస్ బలం

- మూడు రాష్ట్రాల్లోనే అధికారం
- 12కు పెరిగిన బీజేపీ పాలిత రాష్ట్రాల సంఖ్య
- ఉత్తరాదిన మాదే అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ: ఆమ్‌ఆద్మీపార్టీ



బోసిపోయిన ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సంఖ్య మూడుకు తగ్గింది. ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో అధికారం కోల్పోయింది. తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ఆ పార్టీ కర్ణాటక, హిమాచల్, తెలంగాణలో మాత్రమే అధికారం చేపడుతున్నది. ఇక మధ్యప్రదేశ్‌లో అధికారం నిలుపుకోవడంతోపాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ను కూడా బీజేపీ తాజాగా తన ఖాతాలో వేసుకున్నది. దీంతో దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 12కు పెరిగింది. ప్రస్తుతం గెలుపొందిన మూడు రాష్ట్రాలతోపాటు ఉత్తరాఖండ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, గోవా, అస్సాం, త్రిపుర, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఆ పార్టీ సొంతంగా అధికారంలో ఉన్నది. మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలండ్, సిక్కిం రాష్ట్రాల్లో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వాల్లో ఆ పార్టీ భాగస్వామిగా ఉన్నది. బీహార్, జార్ఖండ్, తమిళనాడు సంకీర్ణ ప్రభుత్వాల్లో కాంగ్రెస్ భాగస్వామ్య పక్షంగా కొనసాగుతున్నది. 'నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాల తర్వాత, ఉత్తరాదిన ఆప్ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఆవిర్భవించింది' అని ఆప్ నాయకుడు జాస్మిన్ షా 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం, ఎన్‌పీపీ, ఆప్.. ఆరు పార్టీలు జాతీయ పార్టీ హోదాను కలిగి ఉన్నాయి. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2024లో జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికలతో కలిపి వీటికి ఎన్నికలు నిర్వహించనున్నారు.



## నేడు మిజోరం తీర్పు

### ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం చేపట్టనున్నారు. ఇందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి హెచ్ లినజేలా తెలిపారు. వాస్తవానికి ఆదివారం తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌తోపాటు మిజోరం ఓట్ల లెక్కింపు కూడా చేపట్టాల్సి ఉన్నది. అయితే ఆదివారం తమకు ప్రత్యేక దినమని, ఆ రోజు కౌంటింగ్ వద్దంటూ ఆ రాష్ట్ర ప్రజలు, పలు సంస్థలు చేసిన విజ్ఞప్తి మేరకు ఎన్నికల సంఘం కౌంటింగ్ ప్రక్రియను సోమవారానికి వాయిదా వేసింది. 40 సీట్లున్న మిజోరంలో నవంబర్ 7న ఎన్నికలు జరుగగా, ప్రధానంగా అధికార ఎంఎన్‌ఎఫ్‌తో పాటు జడ్‌పీఎం, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడ్డాయి.

## 6న ఇండియా కూటమి సమావేశం

### లోక్‌సభ ఎన్నికల వ్యూహంపై చర్చ

న్యూఢిల్లీ: విపక్ష ఇండియా కూటమి నాయకులు ఈ నెల 6న ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో సమావేశం కావాలని నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే వ్యూహాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నాలుగు రాష్ట్రాల ఫలితాలు ఆదివారం వెల్లడి కావడంతో వాటి ఫలితాల ఆధారంగా ఇండియా కూటమి తన వ్యూహాలకు పదును పెట్టే అవకాశం కనిపిస్తున్నది. ప్రాంతీయ పార్టీల మధ్య సీట్ల సంపకంపై సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉన్నది. సీట్ల పంపకాన్ని త్వరగా ఖరారు చేయాలని తృణమూల్ కాంగ్రెస్, ఆప్, సమాజ్‌వాదీ లాంటి పార్టీలు కోరినా అసెంబ్లీ ఎన్నికల వల్ల అది వాయిదా పడింది.

## ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎం ఎవరు?

- ముఖ్యమంత్రి రేసులో పలువురు కీలక నేతలు
- గిరిజన లేదా ఓబీసీ నేతనా? మరెవరైనానా?
- బీజేపీ అగ్రనాయకత్వం మదిలో ఎవరు?

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ కంటే ఎక్కువ స్థానాల్లో గెలుపొందింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో కమలం పార్టీ నుంచి సీఎం ఎవరు అవుతారనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతున్నది. సీఎం అభ్యర్థిపై బీజేపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకొంటుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ, సీఎం రేసులో ఉన్న నేతలపై ఇప్పటికే అన్ని పార్టీలు, రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. రాష్ట్రానికి కొత్త సీఎంగా గిరిజన వ్యక్తిని చేస్తారా? లేదా ఓబీసీ వర్గం నేతను ఎంపిక చేస్తారా? లేదా బీజేపీ ఇవేమీ కాకుండా మరో విధమైన నిర్ణయం తీసుకొంటుందా? అనే చర్చ నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేసులో పలువురు సీనియర్ నేతల పేర్లు వినిపిస్తున్నాయి. ఈ జాబితాలో మాజీ సీఎం రమణ్‌సింగ్‌తోపాటు గిరిజన కీలక నేత విష్ణుదేవ్ సాయి, ప్రస్తుతం కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా ఉన్న రేణుకా సింగ్, రాజ్యసభ మాజీ ఎంపీ రామ్‌విచ్చర్ నేతమ్, ఓబీసీ నేత అరుణ్ సావో ఉన్నారు.

**ఎవరి ప్రాముఖ్యత వారిది..**

రాష్ట్ర సీఎంగా గిరిజన వర్గానికి చెందిన



రమణ్ సింగ్

నేతను బీజేపీ అగ్రనాయకత్వం సీఎం చేయాలనుకొంటే విష్ణు దేవ్ సాయ్ ముందు వరుసలో ఉంటారనే చర్చ ఉన్నది. గతంలో రాష్ట్రానికి సీఎంగా చేసిన రమణ్ సింగ్‌కు మరోసారి ముఖ్యమంత్రి పీఠం దక్కనున్నదనేది కొట్టిపారేయలేని అంశం. మరోవైపు మహిళా కోటాలో కేంద్ర మంత్రి రేణుకా సింగ్ కూడా మరో ప్రధాన పోటీదారుగా ఉన్నారు. రామ్‌విచ్చర్ నేతమ్ గతంలో రమణ్ సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. కాగా, సీఎం అభ్యర్థిగా ఓబీసీ కోటాలో అరుణ్ సోవో పేరు ప్రధానంగా వినిపిస్తున్నది. ఆయన బిలాస్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మూడుసార్లు వరుసగా ఎంపీగా గెలిచారు. అరుణ్ సోవోకు ఓబీసీ కమ్యూనిటీలో గట్టి పట్టు ఉన్నది.

## 'మామ' శివరాజా? సింధియా 'మహారాజా'?

### మధ్యప్రదేశ్ సీఎం పీఠం ఎవరికి దక్కేనో?

భోపాల్, డిసెంబర్ 3: మధ్యప్రదేశ్‌లో బీజేపీ అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక్కడ 230 స్థానాల్లో 163 స్థానాల్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా.. తదితరుల నాయకత్వంతో ఈ విజయం దక్కిందంటూ క్రెడిట్ అంతా కేంద్ర నాయకత్వానిదేనంటూ ప్రకటించారు. ఎన్నికల్లో ముందుగా సీఎం అభ్యర్థిని ప్రకటించే బీజేపీ.. ఈ సారి ఆ ఆనవాయితీకి విరుద్ధంగా వెళ్లింది. బీజేపీ అధిష్టానం పార్టీ నాయకత్వంలో కొత్త రక్తాన్ని ఎక్కించే ఆలోచన చేస్తున్నదని, చరిష్మా కలిగిన నాయకుడిగా జ్యోతిరాదిత్య సింధియాను సీఎంను చేస్తుందన్న ఊహాగానాలు వెలువడ్డాయి. దీనికి విరుగుడుగా 'మీ మామ' మళ్లీ సీఎం కావాలా? వద్దా?'.. అంటూ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్.. ఎన్నికల ప్రచారంలో వెళ్లిన ప్రతిచోటా ప్రజల్ని ప్రశ్నించారు. తాజా విజయంతో ఆయన గ్రాఫ్ పెరిగింది.

**శివరాజ్‌పై అధిష్ఠానం విముఖత**

నాలుగుసార్లు సీఎంగా ఉండి, రాష్ట్ర




ప్రజల చేత 'మామాజీ' అని పిలిపించుకుంటూ, పాపులర్ అయిన 64 ఏండ్ల శివరాజ్ సింగ్ చౌహాన్ పార్టీలో అంతర్గతంగా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారని సమాచారం. ఆయన్ని ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపడానికి పార్టీ అధిష్టానం మొదట్నుంచీ విముఖతతో ఉంది. దీంతో ముగ్గురు కేంద్రమంత్రులు, నలుగురు ఎంపీలు, ఒక జాతీయ కార్యదర్శిని ఎన్నికల బరిలో దింపి, వీరిలో ఎవ్వరైనా ముఖ్యమంత్రి కావొచ్చు.. అనేది ప్రచారంలో పెట్టారు. ప్రధాని మోదీ తన సభల్లో చౌహాన్ పాలన గురించి మాట్లాడకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి విషయాలు ప్రస్తావించారు. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ సింగ్ పటేల్, నరేంద్ర సింగ్ తోమర్, కైలాశ్ విజయ్‌వర్గీయ, బీజేపీ రాష్ట్ర చీఫ్ వీడీ శర్మ.. తదితరులు సీఎం పదవిని ఆశిస్తున్నట్టు తెలిసింది. పార్టీ హైకమాండ్ ఆదేశిస్తే సీఎం పదవిని చేపడతానని మరో సీనియర్ నాయకుడు గోపాల్ భార్గవ ప్రకటించారు.

## సీఎం పీఠంపై మరో యోగి?

- రాజస్థాన్ ముఖ్యమంత్రి రేసులో బాబా బాలక్‌నాథ్
- వసుంధర రాజే, దియా, గజేంద్రసింగ్ పేర్లూ పరిశీలనలో

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అధిక స్థానాల్లో విజయం సాధించి సంపూర్ణ మెజారిటీ సాధించింది. దీంతో రాష్ట్రానికి కొత్త సీఎం ఎవరు? అనే చర్చ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ సీఎంగా ఉన్న యోగి ఆదిత్యనాథ్ లాంటి మరో ఆధ్యాత్మిక వేత్త రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించవచ్చునని ఊహాగానాలు వెలువడుతున్నాయి. రాజస్థాన్ యోగిగా పేరొందిన ఆల్వార్ ఎంపీ బాబా బాలక్‌నాథ్ పేరు ముఖ్యమంత్రి రేసులో ప్రముఖంగా వినిపిస్తున్నది. బీజేపీలో సీనియర్ నేతలుగా ఉన్న మాజీ సీఎం వసుంధర రాజే, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. బాబా బాలక్‌నాథ్ తిజారా నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆయన కాంగ్రెస్ అభ్యర్థిపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. రాజస్థాన్ సీఎంగా బరిలో ఉంటారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. బీజేపీకి ప్రాణాధారమైన మోదీ కింద పనిచేయడానికి తాను ఇష్టపడతానని, సీఎం ఎవరు అన్నది అధిష్ఠానమే నిర్ణయిస్తుందని బాలక్‌నాథ్ అన్నారు. రెండుసార్లు సీఎంగా చేసిన వసుంధరా రాజే బీజేపీలో సీనియర్ నేతగా ఉన్న వసుంధరా రాజే గతంలో రెండుసార్లు రాష్ట్రానికి సీఎంగా పనిచేశారు. అయితే ఆమెను



బాలక్‌నాథ్



వసుంధర రాజే



దియా కుమారి

మూడోసారి సీఎం చేసేందుకు పార్టీ అధిష్ఠానం సుముఖంగా లేదని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. గజేంద్ర సింగ్ షెకావత్ ప్రస్తుత సీఎం గెహ్లాట్ ప్రాతినిధ్యం వహిస్తున్న జోధ్‌పూర్‌కు చెందినవారు. దీంతో ఆయన కూడా బీజేపీకి ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నారు. ఇక ఎంపీ దియా కుమారి పేరు కూడా ఈ లిస్టులో వినిపిస్తున్నది. రాజ్‌పుత్ వర్గానికి చెందిన ఈమె తన నియోజకవర్గం సవాయ్ మాధోపుర్‌లో చేసిన అభివృద్ధి కారణంగా విశేష ప్రజాదరణ పొందారు. వసుంధరకు ఈమె ప్రత్యామ్నాయం కాగలరని భావిస్తున్నారు.

# మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమి

మొదటిపేజీ తరువాయి...

చేశారని పేర్కొన్నారు. ఈ మూడు విజయాలు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ కొడుతుందన్న దానికి గ్యారెంటీ అని చెప్పారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీని గెలిపించినందుకు మోదీ అంతకుముందు ఎక్స్ ద్వారా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ ప్రజలు సుపరిపాలన, అభివృద్ధి వైపు నిలబడుతారనే దాన్ని ఈ ఫలితాలు నిరూపించాయని అభిప్రాయపడ్డారు.

**మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఐదోసారి..**

మధ్యప్రదేశ్‌లో బీజేపీ తన పట్టును కొనసాగించింది. 230 నియోజకవర్గాలకుగానూ సునాయసంగా మెజార్టీ మార్క్ సాధించింది. 163 స్థానాల్లో విజయం సాధించి రాష్ట్రంలో ఐదోసారి అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. ఇక్కడ కాంగ్రెస్ అధికార బీజేపీ జోరును ఏమాత్రం అడ్డుకోలేకపోయింది. హస్తం పార్టీ కేవలం 66 స్థానాలకు మాత్రమే పరిమితమై, మరోసారి ప్రతిపక్ష స్థానంతో సరిపెట్టుకొన్నది. బుధ్ని స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కాంగ్రెస్ అభ్యర్థిపై లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. రాష్ట్రంలో 14 ఎన్నికల్లో ర్యాలీల్లో బీజేపీ తరపున ప్రధాన మోదీ ప్రచారం నిర్వహించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ 114 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ 109 నియోజకవర్గాల్లో గెలిచింది. మొదట కాంగ్రెస్ నుంచి కమల్‌నాథ్ ముఖ్యమంత్రి కాగా, తర్వాత జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటు కారణంగా ఆ పార్టీ అధికారం కోల్పోవాల్సి వచ్చింది. 2018 డిసెంబర్–2020 మార్చి మధ్య మాత్రమే కమల్‌నాథ్ సీఎంగా చేశారు. తర్వాత సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో బీజేపీ అధికారం చేపట్టింది. రాష్ట్రంలో అంతకుముందు 2003, 2008,





2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వరుసగా మూడుసార్లు గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**రాజస్థాన్‌లో కొనసాగిన ఆనవాయితీ..**

రాజస్థాన్ కోటలో బీజేపీ మరోసారి పాగా వేసింది. సీఎం అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసింది. గత కొన్ని దఫాలుగా వరుసగా ఏ పార్టీకి అధికారం ఇవ్వని రాజస్థాన్ ఓటర్లు, ఈ సారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. మొత్తం 200 అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ 199 స్థానాల్లో ఎన్నికలు జరుగ్గా.. 115 స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధించింది. రాజస్థాన్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు గెలిచి అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఈసారి మాత్రం 70 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. భారత్ ఆదివాసీ పార్టీ మూడు స్థానాలను గెలుచుకొన్నది. బీఎస్పీ రెండు స్థానాల్లో, ఆర్‌ఎల్డీ, ఆర్‌ఎల్పీ ఒక్కొక్క స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఇక స్వతంత్రులు ఏకంగా 8 స్థానాలను గెలుచుకోవడం విశేషం. అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు పెద్దగా పనిచేసినట్టు కనిపించలేదు. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ప్రముఖుల్లో సర్దార్‌పుర నుంచి సీఎం అశోక్ గెహ్లాట్, టోంక్ నుంచి సచిన్ పైలట్, కోటా నార్త్ నుంచి శక్తి ధరివాల్ ఉన్నారు. 17మంది మంత్రులు పరాజయం పాలయ్యారు. స్పీకర్ సీపీ జోషి బీజేపీ అభ్యర్థి విశ్వరాజ్ సింగ్ మేవార్ చేతిలో ఓడిపోయారు. మాజీ సీఎం, బీజేపీ నేత వసుంధరా రాజే జాల్‌రాపాటన్ స్థానం నుంచి 50 వేలకు పైగా మెజార్టీతో గెలిచారు. రాష్ట్ర ఎన్నికల బరిలో దిగిన ఏడుగురు బీజేపీ ఎంపీలకు గానూ నలుగురు మాత్రమే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు.


## ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు పరాభవం

ఛత్తీస్‌గఢ్‌లో సీఎం భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు టాటా చెప్పారు. 90 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బీజేపీ 54 నియోజకవర్గాల్లో విజయఢంకా మోగించగా, కాంగ్రెస్ 35 స్థానాల్లో గెలిచింది. 2018 ఎన్నికల్లో 68 సీట్లతో హస్తం పార్టీ అధికారం చేపట్టగా.. బీజేపీ కేవలం 15 సీట్లకే పరిమితమైంది. ఈ సారి ఇక్కడ ఎన్నికల ప్రచార సమయంలో బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు ప్రజలను ఆకర్షించినట్టుగా తెలుస్తున్నది. కమలం పార్టీ 'మోదీ కీ గ్యారెంటీ–2023' పేరుతో వివాహిత మహిళలకు ఆర్థిక సాయం వంటి పలు హామీలు ఇచ్చింది. ఇవే ఆ పార్టీని అధికారం దిశగా నడిపాయని విశ్లేషకులు అంటున్నారు.




**మధ్యప్రదేశ్(230), మెజార్టీ-116**

| పార్టీ | గెలిచిన స్థానాలు (2023) | 2018 ఎన్నికల్లో సీట్లు |
|---|---|---|
| బీజేపీ | 163 | 109 |
| కాంగ్రెస్ | 66 | 114 |
| బీఎస్పీ+ | - | 2 |
| ఇతరులు | 1 | 5 |



**రాజస్థాన్(199)- మెజార్టీ 101**

| పార్టీ | గెలిచిన స్థానాలు (2023) | 2018 ఎన్నికల్లో సీట్లు |
|---|---|---|
| బీజేపీ | 115 | 73 |
| కాంగ్రెస్+ | 70 | 100 |
| బీఎస్పీ | 2 | 6 |
| ఇతరులు | 12 | 20 |



**ఛత్తీస్‌గఢ్(90), మెజార్టీ-46**

| పార్టీ | గెలిచిన స్థానాలు (2023) | 2018 ఎన్నికల్లో సీట్లు |
|---|---|---|
| బీజేపీ | 54 | 15 |
| కాంగ్రెస్ | 35 | 68 |
| బీఎస్పీ | 1 | - |
| ఇతరులు | 0 | 7 |